క్లుప్తంగా

గోకులంషెడ్ల నిర్మాణాలకు భూమి పూజ



కొత్తపల్లిలో గోకులం షెడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. శుక్రవారం చిన్నగుమ్మడాపురం, సింగరాజుపల్లి, శివపురం గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మేరి మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీప. థకం ద్వారా మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, శ్రీరాములు నాయక్, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి చర్యలు



భరత్‌గుప్తాకు స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ డైరెక్టర్ డా.నారాయణ భరత్‌గుప్తా తెలిపారు. శుక్రవారం డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులతో తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, కళాశాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అభివృద్ధి నిధులు విడుదలయ్యేలా చూస్తానని చెప్పారు. కళాశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ముందుగా కళాశాలకు వచ్చిన ఆయనకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.ఎం.పద్మ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఆత్మకూరులో 16.2 మి.మీ. వర్షపాతం నమోదు



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. 16.2 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న, మినుము తదితర పంటలు వర్షపు నీటిలో తడిచి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలిన మట్టిమిద్దె



కూలిన మట్టిమిద్దెను చూపిస్తున్న బాధితుడు జయన్న

జూపాడుబంగ్లా: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన అర్లపోగు జయన్నకు చెందిన మట్టి మిద్దె శుక్రవారం తెల్లవారుజామున కూలింది. కుటుంబ సభ్యులు వేరే ఇంట్లో నిద్రిస్తుండడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని వస్తువులు మట్టిలో కలిసిపోయాయి. మిద్దె కూలిపోవడంతో తనకు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయడంతో పాటు పక్కాగృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.

కుమారస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము, స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

మంచినీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ

కొత్తపల్లి: ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ నక్కా విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం గూడెంలో పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేశారు. గ్రామానికి చేరువలో ఉన్న గిరిజన గూడెం ప్రజలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు పనులు ప్రారంభించామన్నారు. సుమారు రూ.8 లక్షల వ్యయంతో పైప్‌లైన్, ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



భారీ వర్షాలతో పెట్టుబడులు కోల్పోయానని చెబుతున్నా ఈ రైతు పేరు గోపాల్‌రావు, కరివేన గ్రామ వాసి. 'ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి విపత్కర పరిస్థితులు ఏర్పడాయి. ఎండాకాలంలో ముందస్తు వర్షాలు కురవడంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, మరో ఐదు ఎకరాల్లో సోయాబీన్ పంటలు సాగు చేశా. జూన్ 2వ వారం నుంచి జూలై వరకు సరిగా వర్షాలు లేకపోవడంతో ఇక పంటలు ధ్వంసం చేయాలనుకున్నాం. అయితే వరుసగా ఇప్పటి వరకు ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కురవడంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, మూడు ఎకరాల్లో సోయాబీన్ నేల కొరిగింది. అరకొరగా 2 ఎకరాల్లో పంట చేతికొచ్చేలా కనిపిస్తోంది. ఎకరాకు రూ.40 వేలు చొప్పున ఖర్చు పెట్టాం. దాదాపు రూ.3.50 లక్షలు దాకా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాల'ని విజ్ఞప్తి చేశాడు.



కరివేన గ్రామానికి చెందిన ఈ రైతు పేరు కురువ చంద్రు. 'ఈ ఏడాది అధిక వర్షాలకు ఐదు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటంతా పూర్తిగా దెబ్బతింది. రూ.3 లక్షలు దాకా నష్టం వాటిల్లింది. ఎన్నడూ లేని భారీ వర్షాలు ఈ ఏడాది కురిశాయి. ఏపుగా పెరిగిన పైరు చూసి మంచి దిగుబడి వస్తుందని ఆశించగా.. వదలకుండా భారీ వర్షాలు కురవడంతో చేతికొచ్చిన మొక్కజొన్న పంట నీటిపాలైంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఎకరాకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాల'ని కోరాడు.

వర్షం..నష్టం

- ఖరీఫ్‌లో రికార్డుస్థాయిలో వాన
- మూడు రెట్లు అధికంగా భారీ వర్షాలు
- నేటికీ పొలాల్లో తొలగని వరద నీరు
- వీడని వరుణుడి ముప్పు..
- పొంగిపొర్లుతున్న ప్రాజెక్టులు, వంకలు, వాగులు
- ఆందోళనలో అన్నదాత



మామిడితోట నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఆత్మకూరు: ఈ ఏడాది తొలకరి వర్షాలు ఖరీఫ్ కంటే ముందుగా పలకరించిన వరుణుడు.. నైరుతి రుతుపవనాల రూపంలో దంచి కొట్టాడు. సీజన్ ప్రారంభంలో మురిపించినా.. ఆ తరువాత రెండు నెలలు చినుకు జాడ లేకపోవడంతో రైతులు నిరాశ చెందారు. అయితే ఆగస్టు నుంచి వరుణుడు ఉగ్ర రూపం ప్రదర్శించడంతో ఆత్మకూరు డివిజన్‌లో పంటలు అల్లకల్లోలమయ్యాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మూడు రెట్లు భారీ వర్షాలు..

ఆత్మకూరు డివిజన్‌లో ఈ ఏడాది భారీ వర్షాలు కురిశాయి. ఎండాకాలంలో మండే రోహిణి కార్తెలో భానుడి ప్రతాపాన్ని తన జోరుతో తగ్గించేశాడు. అదునైన వర్షాలు కువరడంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. దీంతో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, కంది, వేరుశనగ, సోయాబీన్, మెట్ట వరి పంటలు సాగు చేశారు. డివిజన్‌లో దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పుష్కలమైన వర్షాలంటూ ఆనందంతో పొంగిపోయారు. కాగా.. జూన్, జూలై నెలల్లో సరిగా వర్షాలు కురవడంతో పంటలను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి తరుణంలో వరుణుడు మరోసారి మేల్కొని ఆగస్టు, సెప్టెంబరుతో పాటు నేటికీ తన విశ్వరూపాన్ని చూపుతుండటంతో సాధారణానికి మూడు రెట్ల వర్షపాతం నమోదైంది. ఎన్నడూ లేనంత వర్షం కురవడంతో నల్లమలలోని నదులు, వంకలు, వాగులు, ప్రాజెక్టులు నేటికీ పొంగిపొర్లుతున్నాయి. ఇక పొలాల్లో వరదనీరు తొలగక పోవడంతో పైర్లు కుళ్లిపోతున్నాయి. పంట కోత దశలో ఉండటంతో కోత కోయలేని పరిస్థితి నెలకొంది. మరో 20 రోజులు ఎండ కాస్తే తప్పా పంటలు కోత కోసే పరిస్థితి కనిపించడం లేదు. జూలై నెలలో 126 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా రికార్డు స్థాయిలో 205.7 మి.మీ. వర్షం నమోదైంది. ఆగస్టు నెలలో 165 మి.మీ. సాధారణ వర్షం కురవాల్సి ఉండగా, 309.4 మి.మీ., సెప్టెంబరులో 128 మి.మీ.కు గానూ 341.2 మి.మీ. వర్షం కురిసింది. అక్టోబర్ నెలలో 76 మి.మీ. కు గాను ఇప్పటికే 30 మి.మీ. వర్షం కురిసింది.

పొంగి పొర్లుతున్న ప్రాజెక్టులు, వాగులు, వంకలు

వర్షాలు కొనసాగుతుండటంతో డివిజన్‌లోని పలు గ్రామాల్లో ఎన్నడూ నిండని వరదరాజస్వామి ప్రాజెక్టు, సిద్ధాపురం చెరువుతో పాటు మండలంలోని ఇందిరేశ్వరం, కొట్టాల చెరువు, కురుకుంద, కరివేన, కొత్త రామాపురం, కొత్తపల్లి మండలంలోని కనికలమ్మ చెరువు, పాలెం చెరువు, లింగాపురం చెరువు, బాపురం చెరువు, కొత్తపల్లి చెరువులు అలుగు పారుతుండటంతో ఆ నీరు పంట పొలాలను ముంచెత్తింది. దీంతో పంటలు నీట మునిగాయి. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో 6 వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



వర్షపు నీరు నిల్వ చేరి దెబ్బతిన్న మొక్కజొన్న పంట

నష్టపరిహారం అందేనా?..

భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మొక్కజొన్న, సోయాబీన్, కంది పంటలకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు పలుమార్లు వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేసినా సర్కారులో చలనం కొరవడింది.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సత్కరిస్తున్న దశ్యం

వెలుగోడు:స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు షేక్ అహ్మద్ హుస్సేన్, పి.ఇశానుల్లా ఖాన్, జకిరియా పర్వీన్ బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వారిని ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం మాలిఖాన్ మాట్లాడుతూ..అంకిత భావంతో పనిచేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

నందికొట్కూరు: ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకులు ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏపీకి సరైన న్యాయం చేయడం లేదని విమర్శించారు. నష్టపోయిన ఉల్లి, టమాట, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలన్నారు. అఖిల భారత కిసాన్ మహాసభ తాలూకా అధ్యక్షుడు చెరుకుచెర్ల గాబ్రియేల్, నాయకులు ఏసన్న, శేఖర్, సోమప్ప, శ్రీరాములు, లక్ష్మీదేవి, నాగమణి పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



ఆవుకు పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి

పాములపాడు: పాడి పశువుల ఆరోగ్య సంరక్షణతో పాటు, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తి సాధించి నప్పుడు రైతులు రెండింతల ఆదాయం పొందవచ్చని పశువైద్యాధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ పథకంలో భాగంగా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెయ్య దూడల సంఖ్య పెంపు, నట్టల నివారణ, కోళ్లలో వ్యాధుల నివారణ, మినీ గోకులాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం, కిసాన్ క్రెడిట్ కార్డ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 50 మంది రైతులకు చెందిన 9 ఆవులు, 47 గేదెలకు పరీక్షలు నిర్వహించారు. 70 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. 37 సాధారణ కేసులకు చికిత్సలు అందించారు. సర్పంచ్ వరప్రసాదరావు, డాక్టర్లు రవిశంకర్, సాయిలీల, అశోక్, వెటర్నరీ అసిస్టెంట్ శ్వేత పాల్గొన్నారు.

ప్రధాని సభకు 101 బస్సులు

పాములపాడు: ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కర్నూలులో నిర్వహించనున్న బహిరంగ సభకు మండలానికి 101 బస్సులు కేటాయించినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం వెలుగు, ఉపాధి అధికారులతో జిల్లా ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలం నుంచి బస్సుకు 45 మంది చొప్పున 101 బస్సుల్లో 4,550 మందిని తరలించాలని ఆదేశాలందినట్లు ఆయన వివరించారు.

క్రీడల్లో రాణించాలి

మహానంది: విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం అండర్- 14,17 విభాగాల్లో బాలబాలికల క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఎంఈఓ రామసుబ్బయ్య, హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

వెలుగోడు: ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోతుల రాజశేఖర రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ మొదటిసారి శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అక్కడి నుంచి నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు.బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దూపాటి మురళీధర చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు

జయప్రదం చేయండి

ఆత్మకూరు: ఈనెల 11,12తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా రెండవ మహాసభలు ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్నాయని రైతులు, సంఘం నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ శుక్రవారం పిలుపునిచ్చారు. పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాసభలకు ఏపీ రైతు సంఘం జాతీయ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్, రైతాంగ ఉద్యమ నాయకులు, ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.

మాతృసంస్థకు బదిలీ

మహానంది: ఇటీవల దేవదాయశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం నుంచి మహానంది దేవస్థానానికి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ లోకేశ్వరప్ప తిరిగి శ్రీశైలం దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి మహానంది దేవస్థానికి ఉత్తర్వులు అందాయి. శనివారం మధ్యాహ్నం నుంచి రిలీవ్ కానున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి.

డ్రోన్‌తో పిచికారీ.. ఖర్చు తక్కువ

బండిఆత్మకూరు: రైతులు వ్యవసాయ డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేయడం ద్వారా పంటకు సమానంగా మందు పడుతుందని, అంతే కాక రైతు సమయం, నీరు, ఖర్చు ఆదా చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సోమయాజుపల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్ పంట రికార్డులను తనిఖీ చేశారు.

నేడు ధన్-ధాన్య యోజన ప్రారంభం..

'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన', 'పప్పుధాన్యాల స్వావలంబన మిషన్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారని ఏఓ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రతి పొలానికి నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం, పంట వైవిధ్యతను ప్రోత్సహించడం, క్రెడిట్, నిల్వ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం పథక లక్ష్యమని చెప్పారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



ఖోఖో ఆడుతున్న జెడ్పీ, ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

పగిడ్యాల: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లటిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. క్రీడాకారులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్‌లు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ చందూ, సావిత్రి, పీతాంబర్‌రెడ్డి, ఉపాధ్యాయులు షంషూర్‌ఖాన్, రఫీ, అరుణ, మణి, మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం వల్ల సులభంగా అనుకున్న లక్ష్యాలకు చేరుకోవచ్చని ఎంఈఓ-2 శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కనకయ్యకొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ విద్యార్థుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. వంద మందిని డివిజన్ స్థాయిలో ఈనెల 18న జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తున్నట్లు పీఈటీ స్వామన్న తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సంఘం నాయకులు

పగిడ్యాల: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఆ సంఘం మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవో 1217ను రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నిధులను సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఇతర కార్యక్రమాలకు మళ్లించరాదన్నారు. 50 ఏళ్ల నిండిన కార్మికులకు పింఛన్ అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రమాద బీమా కింద రూ. 20 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌కలాం, అచ్చన్న, గౌండబాబు, వెంకటేశ్వర్లు, యూసుఫ్ పాల్గొన్నారు.

అలరించిన భక్తి రంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన అనూరాధాదేవి, బృందం భక్తిరంజని కార్యక్రమంభక్తులను అలరించింది. కార్యక్రమములో గణనాయక, జయ జయ శుభకర, నమోభూతనాథా, అఖిలాండేశ్వరి, శివ శివ శంకరా, శంభో శంకరా గౌరీవర, అయిగిరి నందిని, పశుపతి.. హృదయేశ్వరి తదితర గీతాలను అనురాధాదేవి, ఇందు, వికాస్, సురేష్, సుశీల, వీణ తదితరులు ఆలపించారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి దుర్మార్గం

నందికొట్కూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై చెప్పుతో దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు టి. గోపాలకృష్ణ, పి.పకీర్ సాహెబ్, సి. నాగన్న, దూదేకుల బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 6న సుప్రీంకోర్టు ప్రాంగణంలో అనేకమంది న్యాయవాదుల సమక్షంలోనే న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటును విసిరి ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించతగిన చర్య అని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే, సామాన్య ప్రజలకు ఎలాంటి రక్షణ ఉంటుందో చెప్పగలరా? అని ప్రశ్నించారు. చీఫ్ జస్టిస్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

మహానందీశుడికి పల్లకోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: క్షేత్రంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజ, మహామంగళ హారతులు నిర్వహించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ సేవ ముందు నడిపించారు. భాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ పల్లకోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సాక్షి గణపతి ఆలయం వద్ద నోడల్ అధికారి నారాయణ భరత్ గుప్తా



భ్రమరాంబా అతిథి గృహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ విష్ణు చరణ్

శ్రీశైలం టెంపుల్: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన శ్రీశైలం పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు.అలాగే.. ప్రధాని పర్యటన నోడల్ అధికారి నారాయణ భరత్ గుప్తా కూడా ఆలయం, గెస్ట్ హౌస్, క్షేత్ర పురవీధుల్లో ఏర్పాట్లు, స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు, శివాజీ స్ఫూర్తి కేంద్రం, ధ్యాన కేంద్రాలను పరిశీలించారు. వీరు వేర్వేరుగా ఏర్పాట్లను పరిశీలించారు. జేసీ భ్రమరాంభ గెస్టహౌస్‌ను సందర్శించి వసతి సదుపాయాలు, గదుల శుభ్రత, ఆహార, నిర్వహణ విధానాలను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. జేసీ మాట్లాడుతూ గెస్ట్ హౌస్‌లో సదుపాయాలను ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా మరమ్మతులు, అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, దేవస్థాన అధికారులు ఉన్నారు.

వీడని వాన.. తప్పని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రెయిన్‌గేజ్‌ను ముంచెత్తిన వర్షపు నీరు



నీటమునిగిన తహసీల్దార్ కార్యాలయ వనవిహార్

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంట నూర్పిళ్లు చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, పారుమంచాల, 80బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, పి.లింగాపురం, తూడిచెర్ల గ్రామాల్లో వర్షం దంచికొట్టింది. వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 34.2 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని పాములపాడులో అత్యధికంగా 42.8 మి.మీ కురవగా జూపాడుబంగ్లా మండలంలో 34.2ఎం.ఎం, కొత్తపల్లి మండలంలో 18.6మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట చేతికందడంతో నూర్పిడి చేసుకుందామనుకుంటే ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఆటంకం ఏర్పడుతోంది. అధిక వర్షాల వల్ల ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఇప్పటికే దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో జూపాడుబంగ్లాలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నీరు భారీగా నిలిచిపోయింది. వీధుల వెంట వర్షపు నీళ్లు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి సరికాదు

ఆత్మకూరు: ఉపాధ్యాయుడిపై దాడి చేయడం సరికాదని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చెన్న బసవరాజుపై విద్యార్థి త్రండి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే దాడి చేసి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమయానికి రారు.. సమస్యలు తీర్చరు

- సమయ పాలన పాటించని సచివాలయ సిబ్బంది
- గంటల తరబడి పడిగాపులు కాస్తున్న ప్రజలు



ఉదయం 11 గంటలైనా తెరుచుకోని ఎర్రమఠం గ్రామ సచివాలయం

కొత్తపల్లి: ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయ సిబ్బంది సమయానికి హాజరుకాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎర్రమఠం గ్రామంలో సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలకు విధులకు రావాల్సి ఉన్నా, శుక్రవారం 11 గంటలు దాటినా ఒక్కరు కూడా రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చిన గ్రామస్తులు తలుపులు మూసి ఉండడంతో నిరాశతో వెనుదిరిగారు. ''సమయానికి రారు, సమస్యలు తీర్చరు'' అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఉదయం సచివాలయం శుభ్రం చేస్తారే తప్ప, ఉద్యోగులు సమయానికి రారని గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకున్నారు. ఎర్రమఠం గ్రామం మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో మండలస్థాయి అధికారులు కూడా ఈ సచివాలయాన్ని ఎప్పుడూ సందర్శించకపోవడం వల్లే సిబ్బంది నిర్లక్ష్య ధోరణి పెరిగిందని స్థానికులు అంటున్నారు. ఈ సచివాలయ పరిధిలో ఎర్రమఠం గ్రామంతో పాటు పాతమాడుగుల, కపిలేశ్వరం, ఎర్రమఠం గూడెం, మాడుగుల గూడెం, సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాల తిప్ప గూడెలు ఉన్నాయి. ఈ గ్రామాలు నల్లమల అటవీ ప్రాంతంలో ఉండడంతో, గ్రామస్తులు 15 కిలోమీటర్లు దూరం ప్రయాణించి సచివాలయానికి వస్తున్నారు. అటు సమయం, ఇటు డబ్బులు, కూలీ పోతుందని గిరిజనులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమయానికి రాని సిబ్బందిపై చర్యలు తీసుకుని ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండే చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.